క్లుప్తంగా

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా సునీల్

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ సునీల్ నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఆస్పత్రిలో డీసీహెచ్‌ఓ రవిబాబు మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ సునీల్‌కు నియామకపత్రం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ నరేష్, వైద్యాధికారులు గౌరి ప్రసాద్, డాక్టర్ విశ్వ నిఖిల్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఫ్లెక్సీ ధ్వంసం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు పోలీస్‌స్టేషన్‌లో విషయాన్ని తెలియపర్చారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ



ఐఎన్‌టీయూసీ నూతన క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఐటీసీ అధికారులు

బూర్గంపాడు: ఐఎన్‌టీయూసీ 2024 నూతన క్యాలెండర్‌ను ఐటీసీ పీఎస్‌పీడీలో బుధవారం యూనిట్‌హెడ్ సిద్ధార్థమొహంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు మారం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఐటీసీ పీఎస్‌పీడీ మరింతగా విస్తరించాలని, కొత్త ఏడాది కార్మికులకు మరింత మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్) శ్యామ్ కిరణ్, ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌనె రామారావు, యారం పిచ్చిరెడ్డి, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గౌనె దారుగా, సాజిద్, వెంకటేశ్వరరావు, ఎంఆర్‌ఎస్‌బీ రెడ్డి, వినోద్, షేక్ అబ్దుల్ సలీమ్, సాయి, ఎంపీసీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై వినతి

మణుగూరురూరల్: సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఇఫ్టూ నాయకుడు మంగీలాల్.. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయన ఎమ్మెల్యే, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులను కలిసి పూలమొక్కలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. త్వరలో సింగరేణి యాజమాన్యంతో జరగబోయే సమావేశంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించి హైపవర్ కమిటీ వేతనాలు, ఇతర సమస్యలపై చర్చించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాంగోపాల్, రాంనర్సయ్య, ఆవుల నాగరాజు, ఐఎన్‌టీయూసీ నాయకులు సి.త్యాగరాజన్, వెలగపల్లి జాన్, రాయలింగు, కాంట్రాక్ట్ కార్మికులు ఆర్.విద్యాసాగర్, శివరామకృష్ణ, జి.శ్రీనివాస్, సాంబయ్య పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

అన్నపురెడ్డిపల్లి: గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామంలో ఆ పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. ప్రజాపాలన గ్రామ సభ కేవలం ప్రభుత్వం ప్రకటించిన పథకాల దరఖాస్తుల స్వీకరణకే పరిమితమైందన్నారు. ఇతర ప్రజాసమస్యల పరిష్కారానికి సైతం సభలో దరఖాస్తులను స్వీకరించాలని ఆయన కోరారు. గిరిజన ప్రాంతాల్లో పోడు పట్టాలు, ఉపాధిహామీ, విద్యుత్ సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి జంగిలి వెంకటరత్నం, నాయకులు మహేష్ పాల్గొన్నారు.

సొంత భవనాలు నిర్మించాలి

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వాటిలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు లేక పోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీకాలనీ, సీ కత్తిగూడెం గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త భవనాలను నిర్మించాచి, వాటిల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇర్పా రాంబాబు ఉన్నారు.

మత్తుతో చిత్తవుతున్న యువత

- గంజాయికి బానిసలవుతున్న వైనం
- ఏజెన్సీ ప్రాంతంలో రోజు రోజుకూ పెరుగుతున్న వాడకం
- నిఘా వ్యవస్థల వైఫల్యమే కారణం



దేవుడి ప్రచార రథంలో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలంలో గంజాయికి బానిసలవుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. కొన్నేళ్ల క్రితమే ఈ ప్రాంతంలో గంజాయి సంస్కృతి పురుడుపోసుకుంది. అక్రమంగా గంజాయి తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకుంటున్నారు. అయినా దాని రవాణా ఆగడం లేదు. గంజాయి తీసుకుంటున్న యువత, విద్యార్థులు ఆకతాయిలుగా మారుతున్నారు. మత్తులో ఏం చేస్తున్నారో తెలియకుండాపోతోంది. తరచూ అక్కడక్కడ జరుగుతున్న ఘటనలు ఆడపిల్లల తల్లిదండ్రులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

పట్టణంలోని కొందరు యువత తాగుడు, గుట్కాలు, గంజాయికి బానిసలవుతున్నారు. ఆ మత్తులో బాలికలు, యువతులను వేధించడం మొదలు పెట్టారు. పట్టణంలో పలు కాలనీల్లో మద్యానికి, గంజాయికి బానిసలైన వారు బాలికలను వేధిస్తున్నారంటూ గొడవలు జరుగుతున్నాయి. పెద్దమనుషుల వద్ద పంచాయతీలు చేయడం, అక్కడ అవి సర్దుమనగక పోతే స్థానిక పోలీస్‌స్టేషన్ ఆశ్రయించడం పరిపాటి అయింది. ఈ పరిణామాలు పోలీసులకు సవాల్‌గా మారాయి.

పెరిగిపోతున్న వాడకం

భద్రాచలం పట్టణంతో పాటు బూర్గంపహాడు మండలంలోని సారపాక పట్టణంలో 500 నుంచి 1000 మందికి పైగా యువత, విద్యార్థులు గంజాయికి అలవాటు పడినట్లు నిఘా సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఈ సంస్కృతిని భద్రాచలం నియోజకవర్గ స్థాయిలో ఉన్న చిన్న చిన్న గ్రామాలకు సైతం పదుల సంఖ్యలో యువత గంజాయి బారిన పడినట్లు సమాచారం. భద్రాచలం పట్టణంలో పోలీసులు పట్టుకున్న కొన్ని ఘటనల వివరాలను కింద పొందుపరుస్తున్నాం.. ఆ సమాచారాన్నిబట్టి గంజాయి వాడకం, రవాణా ఏ స్థాయిలో ఉందో అంచనా వేయొచ్చు.

- 2023, జులై 24న బొలెరో వాహనంలో రూ.56 లక్షల విలువైన 280 కిలోల గంజాయిని ముగ్గురు వ్యక్తులు తరలిస్తుండగా.. భద్రాచలం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- 2023, ఆగస్టులో రెండు వేరువేరు ఘటనల్లో రూ.6.6 లక్షల విలువైన 33 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు నిందితులు అరెస్టయ్యారు.
- సెప్టెంబర్‌లో జరిగిన మూడు సందర్భాల్లో రూ.13.2 లక్షల విలువైన 66 కేజీల గంజాయిని పట్టుకుని ముగ్గురు నిందితులు, ఒక మహిళతోపాటు ఒక మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు.
- అక్టోబర్‌లో మొత్తం రూ.8.80 లక్షల విలువైన 44 కేజీల గంజాయి పట్టుబడగా.. 8 మంది అరెస్టయ్యారు.
- నవంబర్‌లోని పలు ఘటనల్లో 16.84 లక్షల విలువైన 86 కేజీల గంజాయి పట్టుబడగా.. 16 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు.
- డిసెంబర్ 11న దేవుడి ప్రచార వాహనంలో రూ.96.80 లక్షల విలువైన 484 కేజీల గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నింధితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కట్టడిలో వైఫల్యం..

గంజాయి, మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట వేయడంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల దేవుడి భక్తి పేరుతో సంచరించే దేవుడి వాహనంలో గంజాయి తరలిస్తూ ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. కానీ సరుకు ఎక్కడి నుంచి వస్తోంది.. ఎవరెవరికి సరఫరా చేస్తున్నారు. సూత్రధారులు ఎవరు అనే కోణంలో దర్యాప్తు జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరోపణలు వచ్చినప్పుడు.. ఏదైనా సంఘటన వెలుగు చూసినప్పుడు, లేదా మరేదైనా ముఖ్యమైన కార్యక్రమం భద్రాచలంలో జరుగుతున్న సమయంలో హడావుడి చేయడం తప్ప ఆ తరువాత మత్తు పదార్థాల కట్టడి గురించి పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల హైదరాబాద్ లో గంజాయి, డ్రగ్స్, తదితర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయంపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో అదే తరహాలో ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలం కూడా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలి



ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలం నాలుగు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్నందున్న పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలి. నిత్యం భద్రాచలం మీదగా అక్రమంగా పశువులు, గంజాయి, ఇతర ప్రభుత్వ నిషేధితాలను రవాణా చేస్తున్నారు. దీనిద్వారా స్మగ్లర్లు జీవనాన్ని సాగిస్తున్నారు. వీటిని అరికట్టాల్సింది పోలీసులే. వీలైనంత వరకు పోలీసులు నిర్లక్ష్యాన్ని వీడితే వీటన్నిటినీ అరికట్టవచ్చు.

– శ్రీధీరాల వెంకటాచారి, భద్రాచలం

తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి



చదువుతున్న విద్యార్థులు తప్పు దారిపట్టకుండా వారి తల్లిదండ్రులు నిత్యం పర్యవేక్షణ చేయాలి. అప్పుడే పిల్లలు వ్యవహరిస్తున్న తీరు, వారు అనుసరిస్తున్న దారి, స్నేహితులతో వారు మెదుగుతున్న తీరు, తదితర వాటిపై పూర్తి స్థాయిలో అవగాహన వస్తుంది. ప్రస్తుతం ఉన్న యువత త్వరగా డబ్బులు సంపాదించే మార్గాలను అన్వేషించడంతోపాటు, వ్యసనాలకు అలవాటు పడుతున్నారు.

– సమతా శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు, భద్రాచలం

కఠిన చర్యలు తప్పవు



ప్రభుత్వ నిషేధిత గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవు. వీటి రవాణాలో ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించేది లేదు. ఇప్పటికే గంజాయి రవాణాలో పట్టుబడిన, జైలుకి వెళ్లి, విడుదల అయిన వారిపై పోలీసుల నిఘా ఉంది. విద్యార్థులు తప్పుడు దారిలో వెళ్లకుండా పాఠశాలల్లో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఇటీవల పట్టుబడిన వారు ఎక్కువ శాతం విద్యార్థులు, యువతే ఉన్నారు.

– పింగిళి నాగరాజు రెడ్డి, టౌన్ సీఐ, భద్రాచలం

వాటర్ ప్లాంట్ ప్రారంభం



ఏకలవ్య పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

దమ్మపేట: మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో తాగునీటి ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సతీసమేతంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మంగళవారం వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే దంపతులను, ఎన్‌సీసీ క్యాడెట్లు సాదరంగా పాఠశాలలోకి ఆహ్వానించారు. వాటర్ ప్లాంట్ నిర్మాణానికి పాఠశాల సిబ్బందితో పాటుగా ఎమ్మెల్యే కూడా కొంతమేరకు ఆర్థిక సహకారం అందించారు. ఎమ్మెల్యే కుమారుడు సచిన్, కూతురు లాస్య కూడా ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించడం విశేషం. పాఠశాలలో విద్యార్థులు ఉదయ కాలం నిర్వహించే ప్రార్థన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం దమ్మపేట గ్రామంలోని గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల, కళాశాలలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే.. విద్యార్థుల ప్రయోగాత్మక కృత్యాలను పరిశీలించి, అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, కొయ్యల అచ్యుతరావు, వట్టి వెంకట్రావు, రొయ్యల కుమార్, ఏకలవ్య ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ హరిత, రజినీ, పీడీ ప్రసాద్, గురుకుల ప్రిన్సిపాల్ జాను నాయక్, శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారం లేదనే నిరుత్సాహం వద్దు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేట/అశ్వారావుపేటరూరల్: అధికారం లేదనే నిరుత్సాహం వద్దని, ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవించి ముందుకు వెళ్దామని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపం ఆవరణలో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ క్యాడర్ అంతా శక్తికి మించి కష్టపడి పని చేశారని, కానీ ఓటర్ల తీర్పు వేరేలా వచ్చిందన్నారు. అధికారంలో లేకపోయినా ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని, ఏ అవసరం ఉన్నా తాను అందుబాటులోనే ఉంటానని అన్నారు. త్వరలోనే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి, సోయం వీరభద్రరావు, వగ్గెల పూజ, నారం రాజశేఖర్, మందపాటి మోహన్‌రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, సంకా ప్రసాద్, సత్యవరపు సంపూర్ణ, జక్కుల రాంబాబు పాల్గొన్నారు.

సభలో గందరగోళం

కాగా సభలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి మాట్లాడుతుండగా జక్కుల రాంబాబు అనే గ్రామ స్థాయి నాయకుడు 'ఆపు.. నీసోది ఆపు..' అంటూ తిరుగుబాటు గళం వినిపించాడు. కుల రాజకీయాలు చేసి మెచ్చా నాగేశ్వరరావు ఓటమికి కారణమయ్యారంటూ విమర్శించాడు. రాంబాబును అడ్డుకునే ప్రయత్నం చేసిన వారిని విమర్శిస్తుండగా మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కల్పించుకుని వివాదాన్ని తుంచేశారు.

యంత్రాల తరలింపుపై ధర్నా



జిల్లా క్షయ నియంత్రణ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని క్షయ నిర్ధారణ పరీక్షా యంత్రాలను కొత్తగూడెం మెడికల్ కళాశాలకు తరలించడాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని సీపీఎం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం టీబీ కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబి.నర్సారెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి గద్దం స్వామిలు మాట్లాడుతూ.. నాలుగు రాష్ట్రాలకు కేంద్ర బిందువుగా ఉన్న భద్రాచలం ఆస్పత్రిలో గిరిజన పేద ప్రజలకు కోసం టీబీ వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయని, అందుకోసం నాటి ఎమ్మెల్యే కుంజా బొజ్జి కృషి చేశారని తెలిపారు. వేలాది మందికి ఉపయోగంగా ఉన్న ఈ యంత్రాలను జిల్లా కేంద్రంలో ఉన్న టీహబ్‌కు తరలించాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరైనది కాదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, పారేల్లి సంతోష్ కుమార్, నాదెళ్ల లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు డి.సీతామహాలక్ష్మి, ఎన్. నాగరాజు, ఎంవీఎస్ నారాయణ, మాజీ ఎంపీటీసీ చేగుండి శ్రీనివాస్, శాఖా కార్యదర్శులు డి.రామకృష్ణ, బి.ధర్మారావు, కాకా రమణ, కొరసా రవి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌డీఓ

దుమ్ముగూడెం: అటవీప్రాంతంలో అకస్మాత్తుగా సంభవించే అగ్నిప్రమాదాలపై అటవీశాఖ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎఫ్‌డీఓ మక్సూద్ మోహీనుద్దీన్ సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం అటవీరేంజ్ పరిధిలోని సిబ్బందికి పర్ణశాల సెక్షన్‌లో ఈ అవగహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అడవిలో అగ్గిపుట్టడానికి కారణాలు ఏంటి, అగ్గి ఎక్కడ పడుతుంది, ఎలా మొదలవుతుంది, దానికి కారుకులెవరు, వారిని ఎలా ఒప్పించగలం, మనం ఏం చేయ్యాలి, ఈ సమయంలో మీ సంసిగ్ధత ఎలా ఉంది అనే దానిపై సిబ్బందికి అవగహన కల్పించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారులు కనకమ్మ, ఉపేంద్ర, రంజిత, డీఆర్వో శోభన్‌నాయక్, మూడు రేంజ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారికి ఎంపీపీ నివాళి

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారం గ్రామానికి చెందిన చిన్నారి ఎల్లావుల గ్రీష్మిత(6) ఇంటిఆవరణలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ నీటి తొట్టిలో పడి మంగళవారం రాత్రి మృతి చెందింది. తల్లిదండ్రులు లింగరాజు, రాగమయికి కూతురు గ్రీష్మిత మణుగూరులో ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీ చదవుతోంది. గ్రీష్మిత మృతదేహానికి ఎంపీపీ ముత్తినేని సుజాత బుధవారం నివాళులర్పించి తల్లిదండ్రులను పరామర్శించారు.

రామ మందిర చిత్రపటాలు పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం అశోక్‌నగర్ కాలనీ, రెవెన్యూ కాలనీల్లో పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో అయోధ్య రామ మందిరం చిత్రపటాలను బుధవారం ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒక వినతిపత్రం అందజేసి అయోధ్య అక్షింతలను అందజేసి వాటి విశిష్టతను వివరించారు. కార్యక్రమం బీజేపీ నాయకులు రామ్మోహన్, మహిళ మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులకు సన్మానం

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో 40 ఏళ్లుగా పర్మినెంట్ కార్మికులుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఎండి.అజీజ్, బడే సాహెబ్‌లను సారపాక జమాతే ఇస్లామిక్ హింద్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. పర్మినెంట్ కార్మికులుగా వారు చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్మికసంఘాల నాయకులు కనకమేడల హరిప్రసాద్, యారం పిచ్చిరెడ్డి, గౌనె రామారావు, సానికొమ్ము శంకర్‌రెడ్డి, గాదె రామకోటిరెడ్డి, ఎండి.ఇషాక్, జహీర్ పాషా, సైదుద్దీన్, అబ్దుల్ సలీమ్ ఇమ్రాన్, హఫీజ్, ఇబ్రహీం, బషారత్, నాగూర్ వలి, సిలార్ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు వినతి

ములకలపల్లి: మండలకేంద్రంలో నిర్వహిస్తున్న మూకమామిడి పామ్ ఆయిల్‌ఫెడ్ ప్రొడ్యూసర్ కంపెనీ (ఎఫ్‌పీఓ)కి సప్లై చేస్తున్న ఎరువుల లారీలకు ట్రాన్స్‌పోర్టు కిరాయి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ఎఫ్‌పీఓ డైరెక్టర్ కరుటూరి కృష్ణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. బుధవారం గండుగుపల్లిలోని స్వగృహంలో మంత్రి తుమ్మలను కలిసి, సమస్యను విన్నవించారు. మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీకి సరఫరా చేస్తున్న ఎరువులకు ఎటువంటి కిరాయి వసూలు చేయడంలేదని అన్నారు. తమ సంఘానికి కూడా అదేవిధంగా కిరాయిలేకుండా చూడాలని అభ్యర్థించారు.

సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవం

దమ్మపేట: మండల కోఆపరేటివ్ సొసైటీలో ఖాళీగా ఉన్న రెండు డైరెక్టర్ల ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. దమ్మపేట సొసైటీలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా, గత కొద్దినెలల కిందట 2, 3 వార్డులకు చెందిన ఇద్దరూ సొసైటీ డైరెక్టర్లు అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఖాళీగా ఉన్న ఆ రెండు డైరెక్టర్ల స్థానాలకు బుధవారం కోఆపరేటివ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో ఎన్నికను నిర్వహించారు. ప్రస్తుతం సొసైటీలో గల 11 మంది డైరెక్టర్లు (చైర్మన్‌తో కలిపి) ఏకగ్రీవంగా రెండు పేర్లను ప్రతిపాదించారు. దమ్మపేటలోని 2వ వార్డుకు మృతుడు నాయుడు చెన్నారావు సతీమణి నాగమణి, మల్కారంలోని 3వ వార్డుకు కొమ్ము చినమంగయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కోపరేటివ్ సీఈఓ నాగేశ్వరరావు, చైర్మన్ రావు జోగేశ్వరరావు, డైరెక్టర్లు ఎల్లిన రాఘవరావు, చిన్నశెట్టి సత్యనారాయణ, రవికుమార్ పాల్గొన్నారు.

పూలేను ఆదర్శంగా తీసుకోవాలి



చర్ల: సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



అశ్వారావుపేటరూరల్: పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న బీసీ సంఘం నాయకులు

చర్ల: తొలితరం ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలేను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు సూచించారు. సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకుని బుధవారం చర్లలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి కారం నరేష్ నేతృత్వంలో కార్యక్రమం ఏర్పాటు చేయగా.. రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు మచ్చా రామారావు, బందెల చంటి, దొడ్డి హరినాగవర్మ, శ్యామల వెంకట్, బి.శ్రీను, గోపాల్, తాటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: వీరవనిత సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక రింగ్‌రోడ్ సెంటర్‌లోని ఆమె విగ్రహానికి బీసీ సంఘం నాయకులు అంకత మల్లికార్జున్‌రావు, అంకోలు వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పూలమాల పూలమాలలు వేసి నివాళులర్పించారు. కైలా శ్రీరాములు, దేవరకొండ త్రినాథ్, మైనం రామకృష్ణ, కిలారి మర్కండేయ, ఎస్‌కే పాషా, భూషి పాండు, మైనార్టీ గురుకుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని పీవీకాలనీలోపి సింగరేణి హైస్కూల్‌లో పాఠశాల కరస్పాండెంట్, సింగరేణి మణుగూరు ఏరియా అధికార ప్రతినిధి రమేష్ ఆదేశాల మేరకు బుధవారం సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత పాఠశాల హెచ్‌ఎం స్వరూపరాణి సావిత్రీబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.కల్యాణి, తెలుగు పండింట్ ఎం.వేణు, మస్తానయ్యా తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమమే ధ్యేయం

మణుగూరురూరల్: కార్మిక సంక్షేమమే టీబీజీకేఎస్ ప్రధాన ధ్యేయమని, కార్మికులెవ్వరూ అధైర్యపడొద్దని యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ రావు అన్నారు. బుధవారం పీవీకాలనీలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో టీబీజీకేఎస్‌కు అండగా నిలిచి ప్రోత్సహించిన కార్మిక వర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో అధికార పార్టీ ప్రలోభాలకు తలొగ్గకుండా కార్మికవర్గం 728 ఓట్లు వేయడం సంతోషదాయకమన్నారు. ఏరియా యూనియన్ నాయకత్వంపై నమ్మకం ఉంచిన అండగా నిలిచిన ప్రతీ కార్మికుడిని టీబీజీకేఎస్ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని భరోసా ఇచ్చారు. ఇకపై ప్రతిపక్ష హోదాలో కార్మిక హక్కులు, సమస్యల పరిష్కారం కోసం సంఘం పోరాడుతుందని తెలిపారు. సమావేశంలో టీబీజీకేఎస్ బ్రాంచ్ నాయకులు వీరభద్రయ్య, ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ, మునిగెల రమేష్, అశోక్, ఇజ్రాయేల్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ప్రజాపాలన'



గుండాల: గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

ప్రభుత్వం నిర్ణయించిన తేదీలు, ప్రాంతాల ప్రకారం.. బుధవారం పలుచోట్ల ప్రజాపాలన కొనసాగింది. స్థానిక నాయకులు, అధికారులు తగిన ఏర్పాట్లను చేయగా.. ప్రజలు తమ దరఖాస్తులను పూరించి అందజేశారు. పలుచోట్ల జనం పోటెత్తడంతో గంటలకొద్ది క్యూలో నిలుచోవాల్సి వచ్చింది. పలువురు ప్రజాప్రతినిధులు కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కొన్ని చోట్ల పోలీసులు దరఖాస్తులను నింపుతూ సహకరించారు. రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులు కేంద్రాలను సందర్శించి తీరుతెన్నులను పరిశీలించారు.

– సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: ప్రగల్లపల్లి పంచాయతీలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీడీఓ ముత్యాలరావు



మణుగూరురూరల్: ప్రజాపాలన సభను పరిశీలిస్తున్న డీఎస్పీ రాఘవేంద్రరావు



అశ్వారావుపేటరూరల్: ఆసుపాకలో బారులుదీరిన దరఖాస్తుదారులు



దుమ్ముగూడెంల: ఆర్లగూడెంలో మహిళల దరఖాస్తులు పూరిస్తున్న కానిస్టేబుల్ కృష్ణారావు